క్లుప్తంగా

నేడు జహీరియా బర్సీ మహోత్సవం

కమలాపురం : కమలాపురం పెద్ద దర్గాగా వెలుగొందుతున్న దర్గా-ఏ-గఫారియా స్వర్గీయ పీఠాధిపతి హాజీ హజరత్ జహీరుద్దీన్ షా ఖాద్రి బర్సీ మహోత్సవాన్ని ఆదివారం పీఠాధిపతి సజ్జాద్-ఏ-నషీన్ హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం పీఠాధిపతి ఇంటి నుంచి భక్తులతో ఊరేగింపు జరుగుతుందని వారు తెలిపారు. జహీరియా దర్గాలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం నాత్, పీఠాధిపతి బయాన్ చేస్తారని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

షైనింగ్ స్టార్ అవార్డుకు విద్యార్థుల ఎంపిక

చక్రాయపేట : మండలంలోని నాగలగుట్టపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు 10వ తరగతి ఫలితాల్లో చక్కటి ప్రతిభ కనపరచి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు సూర్యనాగమునిరెడ్డి తెలిపారు. తమ పాఠశాలకు చెందిన శివశ్రీ, లిఖిత, జశ్వంత్‌లు ఈ అవార్డుకు ఎంపికయ్యారన్నారు. ఈ అవార్డు కింద వీరికి ఒక్కొరికి రూ.20 వేల నగదు, మెడల్, ప్రశంసా పత్రం అందజేస్తారన్నారు.

కార్మికుల పని గంటలు పెంచడం దుర్మార్గం

జమ్మలమడుగు : లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా జూలై 9న యావత్ భారతదేశ వ్యాప్తంగా సమ్మెకు దిగుతున్న సమయంలో మన రాష్ట్ర ప్రభుత్వం పని గంటలను 8 గంటల నుంచి 12 గంటల వరకుపెంచుతూ క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం దుర్మార్గమైనదని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివనారాయణ తెలిపారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆధునిక యుగంలో పనిగంటలను కార్మికులకు తగ్గించవలసిందిపోయి పెంచడం చూస్తుంటే ప్రభుత్వానికి మతి భ్రమించినట్లు ఉందన్నారు. చాలా కంపెనీలు పనికి తగ్గ వేతనం ఇవ్వకపోగా వారితో వెట్టి చాకిరి చేయించుకుని వారి శ్రమను దోచుకుంటున్నారు. రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం వెంటనే మార్చుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయండి

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఇందిరానగర్‌లో సుమారు 3000 కుటుంబాలకు పైగా ఉన్న నేపథ్యంలో ఒక్క రేషన్ దుకాణం మాత్రమే ఉండటంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇక్కడ ఉన్న రేషన్ దుకాణంలో 500 మందికి మాత్రమే రేషన్ పంపిణీ చేస్తున్నారని మిగిలిన వారంతా ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకోవాల్సిందేనన్నారు. ఈ ప్రాంతంలోనే మరికొన్ని రేషన్ షాపులను ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ మండల కార్యదర్శి ప్రసాద్ కోరారు. ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్న వారు సమీప ప్రాంతాల్లోని బి.ఎస్.తాండ, బలిజపల్లి గ్రామాలకు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకుంటున్నారన్నారు. అధికారులు, నాయకులు స్పందించి జనాభా మేరకు అవసరమైన రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

సభ్యత్వాలు చేశామంటూ గొప్పలు



తనకు తెలియకుండా టీడీపీ సభ్యత్వం కార్డును చేశారని చూపుతున్న దాదిరెడ్డి భాగ్యమ్మ

వల్లూరు (చెన్నూరు) : బలిసింగాయపల్లి వైఎస్సార్‌సీపీ మహిళా విభాగ జనరల్ సెక్రటరీ దాదిరెడ్డి భాగ్యమ్మ తెలుగుదేశం పార్టీ తన ప్రమేయం లేకుండా సభ్యత్వ నమోదు చేసి కోటి సభ్యత్వాలు చేశామంటూ గొప్పలు చెప్పడంపై మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ ఉత్తర కుమారుని ప్రగల్భాలవలె కోటి, రెండు కోట్లు సభ్యత్వాలు చేశామంటూ గొప్పలు చెప్పుకోవడం సబబు కాదన్నారు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకులను తమకు తెలియకుండా తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఇవ్వడం ఎంటన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వాల్లో మరెన్నో మోసాలు ఉన్నాయని, ఒకసారి ఆత్మ విమర్శ చేసుకుంటే మంచిదని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు.

9న నిరసన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప కార్పొరేషన్‌లో డాక్యుమెంట్ అప్లోడ్ చేయకుండా అక్రమంగా ఇంటి పన్ను మార్పు చేసిన అధికారులను సస్పెండ్ చేయాలని, యథావిధిగా భూమన వెంకటసుబ్బయ్య పేరున ఇంటి పన్ను వచ్చే విధంగా తగు చర్యలు చేపట్టాలని 9న కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి యన్.వెంకటశివ తెలిపారు.

ఘనంగా బక్రీద్ వేడుకలు



వేంపల్లెలో ప్రత్యేక ప్రార్థనలలో ముస్లింలు

కమలాపురం : ముస్లింలు భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. శనివారం కమలాపురం పట్టణంతో పాటు మండల పరిధిలోని జీవంపేట, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, పందిళ్లపల్లె, కోగటం, మొలకవారిపల్లె, విభరాపురం, గంగవరం, అప్పాయపల్లె, సి.గోపులాపురం తదితర గ్రామాలలో బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక ఈద్గా మైదానానికి ప్రత్యేక నమాజ్ ఆచరించారు. ప్రభుత్వ ఖాజీ సయ్యద్ జాహిద్ హుసేన్ నమాజ్ చదివించారు. మరో ప్రభుత్వ ఖాజీ సయ్యద్ నాసీర్ హుసేని బక్రీద్ పండుగ ప్రత్యేకతను, విశిష్టతను బయాన్ రూపంలో వివరించారు. అనంతరం ప్రపంచ శాంతి కోసం జాహిద్ హుసేన్ దువా చేశారు. అనంతరం ఒకరి కొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. అలాగే దర్గా మస్జిద్‌లో పీఠాధిపతి హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో ప్రత్యేక నమాజ్ ఆచరించారు. అంతకు ముందు పీఠాధిపతి భక్తులకు సందేశం అందించారు. భక్తులంతా పీఠాధిపతికి ఈద్ ముబారక్ తెలిపారు. అలాగే స్థానిక రైల్వే గేటు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈద్గా మైదానంలో ప్రత్యేక నమాజ్ ఆచరించారు.



కమలాపురం బయాన్ చేస్తున్న నాసీర్ హుసేనీ

పులివెందులలో..

పులివెందుల టౌన్ : పట్టణంలోని పలు మసీదులలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక శ్రీరామాహాల్ వద్ద ఉన్న పాత ఈద్గా వద్ద, పెద్ద మసీదు, జామియా మసీద్ తదితర మసీదులలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పార్నపల్లె రోడ్డులోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మత పెద్దలు బక్రీదు పండుగ గురించి వివరించారు. ప్రతి ఒక్కరు కుర్బాని ఇవ్వాలని సూచించారు.

వేములలో..

వేముల : మండల వ్యాప్తంగా బక్రీదు పండుగ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మత సామరస్యానికి, త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీదు పండుగను పురస్కరించుకుని వేములలోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

లింగాలలో..

లింగాల : మండలంలోని లింగాల, పార్నపల్లె, వెలిదండ్ల, పెద్దకుడాల తదితర గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు బక్రీదు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అదేవిధంగా పేదలకు దానధర్మాలు చేశారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక మదీనాపురం, బిస్మిల్లా మసీదు, ఈద్గా మైదానంలో ముస్లింలు కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బక్రీద్ పండుగ విశిష్టతను మత గురువులు తెలియజేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ఈద్గాల వద్దకు ముస్లింలు కొత్త బట్టలను ధరించి వెళ్లారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లింలు ప్రార్థనలు చేసే సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సీఐ నరసింహులు, ఎస్ఐ రంగారావుల ఆధ్వర్యంలో పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండల కేంద్రంతోపాటు గురజాల, బిదినంచర్ల, కోవరంగుంటపల్లె, బలపనూరు తదితర గ్రామాల్లో ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో శనివారం మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ధనిక, పేద అన్న తారతమ్యం లేకుండా రాగద్వేషాలకతీతంగా ముస్లింలందరూ భక్తిశ్రద్ధలతో చేసుకునేది బక్రీద్ అన్నారు. 07పీఎల్‌వీడీ251-170089 :- సింహాద్రిపురం : బక్రీదు సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలలో ముస్లింలు

తొండూరులో..

తొండూరు : మండలంలోని కృష్ణంగారిపల్లె, సంతకొవ్వూరు, అగడూరు, మల్లేల, తొండూరు, భద్రంపల్లె, బోడివారిపల్లె తదితర గ్రామాల్లో ఉన్న ఈద్గాల వద్దకు ముస్లింలు ర్యాలీగా వచ్చి అనంతరం అక్కడ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈద్ ముబారక్ అంటూ ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మల్లేల గ్రామంలో పెద్ద ఎత్తున ముస్లింలు ఇమాంబి దర్గా వద్ద నుంచి మెయిన్ రోడ్డు మీదుగా లావనూరు రోడ్డు ఊరి చివర ఉన్న ఈద్గా వద్దకు ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : మనం చేసే ప్రతి మంచి పనిలో దేవుడిని చూడవచ్చు అని ప్రభుత్వ ఖాజీ ఆస్థానయే గౌసియా గురువు సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ, జామియామసీదు పీఠాధిపతి సయ్యద్‌షా సాదిక్‌పాషా ఖాద్రీలు పేర్కొన్నారు. శనివారం బక్రీద్ పండుగ సందర్భంగా రైల్వేస్టేషన్ సమీపంలోని ఈద్గాలో, నవాజు కట్ట వద్ద వేరువేరుగా బక్రీద్ పండుగ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆకలితో ఉన్నవారిని ఆదుకుంటే దేవుడు మనల్ని పుణ్యలోకాలను ప్రాప్తి చేయిస్తాడన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఇచ్చె ఖుర్బానీ పేదలకు, బంధువులకు, స్నేహితులకు మూడు వంతులుగా భాగాలుచేసి పంపిణీ చేయాలన్నారు.

ఎర్రగుంట్లలో..

మండలంలోని చిలంకూరు, ఎర్రగుంట్ల ఈద్గాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఈద్గాల్లో మత గురువులు ప్రత్యేక ప్రసంగాలను ఇచ్చారు.

పెద్దముడియంలో..

పెద్దముడియం : పెద్దముడియంతో పాటు పెద్దపసుపుల, జంగాలపల్లె, సుద్దపల్లె, జె.కొట్టాలపల్లె, నెమళ్లదిన్నె, గుండ్లకుంట, పాలూరు, బి.టి.పాడు గ్రామాలలో ముస్లింలు ప్రత్యేక పార్థనలు చేశారు. ఈద్గా మైదానాలలో బక్రీద్ పండుగ విశిష్టతను, కుర్బానీని వివరించారు. అనంతరం ముస్లింలు ఒకరికొకరు ఈద్‌ముబారక్ తెలుపుకున్నారు.

కొండాపురంలో..

కొండాపురం : కొండాపురంలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. మత పెద్ద హాఫీజ్ అన్సర్ అహ్మద్ బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు. ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని బోడెద్దులపల్లె, జమాల్‌పల్లె, లక్కిరెడ్డిపల్లె, ఆజాద్‌నగర్, మూలవంక, ఇందిరానగర్, తదితర గ్రామాలలో బక్రీద్ పండుగ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. మత గురువుల ద్వారా బక్రీద్ పండుగ ప్రత్యేకతను, దైవ సందేశాన్ని తెలుసుకున్నారు. ఒకరికొకరు ఈద్ ముబారక్ తెలుపుకున్నారు.

వల్లూరులో..

వల్లూరు : వల్లూరు, పెద్దపుత్త, దిగువపల్లె, తప్పెట్ల, తొల్లగంగనపల్లె, ధర్మాపురం కాలనీ, పైడికాలువ, కోట్లూరు, గణేష్ పురం తదితర గ్రామాలలో ముస్లింలు ఈద్గాలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. మత గురువులు సందేశాలను ఇచ్చారు. ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. విందులలో పాల్గొని సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో మత పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.

చెన్నూరులో..

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు హజ్ హౌస్ వద్ద, ఖిల్లా మసీదులో బక్రీద్ సందర్భంగా నిర్వహించిన నమాజ్ ప్రార్థనల్లో ముస్లింలు పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. హజరత్ ఇబ్రహీం యొక్క త్యాగనిరతిని చాటి చెప్పే పండుగ బక్రీద్‌గా తెలియజేశారు.



వేములలోని ఈద్గా ప్రార్థనలలో ముస్లింలు



లింగాలలోని ఈద్గా వద్ద ప్రార్థనలలో ముస్లింలు



జమ్మలమడుగులో ప్రసంగిస్తున్న గౌస్‌పీరాఖాద్రీ



కమలాపురంలో బయాన్ వింటున్న ముస్లింలు



జమాల్‌పల్లెలోని ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



పెద్దపుత్త మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



చెన్నూరులో బక్రీద్ ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



కొండాపురంలో బక్రీద్ విశిష్టత విరిస్తున్న మత పెద్ద



చిలంకూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. షుగర్ పరీక్ష చేయించుకోవాలనుకునేవారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. అలాగే ఆసుపత్రిలో నూతనంగా డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందని, కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవు

వేంపల్లె : ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే అలాంటి వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని సీఐ నరసింహులు తెలిపారు. శనివారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్‌పై తోపుడుబండ్ల వ్యాపారులకు, మోటర్ బైకు వాహనదారులకు సూచనలు ఇచ్చారు. అలాగే వాహనాలను తనిఖీ చేసి రికార్డులులేని వాటికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనాలకు రికార్డులు సక్రమంగా ఉండాలని, రికార్డులు లేని వాహనాలకు జరిమానాలు విధించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. లైసెన్సులు కలిగిన వారు మాత్రమే వాహనాలను నడపాలన్నారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇస్తే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రంగారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ట్రాఫిక్‌పై సూచనలిస్తున్న సీఐ నరసింహులు

క్రీడలతో మానసిక ఉల్లాసం

వేంపల్లె : క్రీడల ద్వారా మానసికంగా, ఉల్లాసంగా ఉంటారని గ్రామ సర్పంచ్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ముగింపు పోటీలు జరిగాయి. క్రికెట్ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌లో నందిమండలం, వేంపల్లె జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో నంది మండలం జట్టు విన్నర్‌గా నిలవగా, వేంపల్లె జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా సర్పంచ్ విన్నర్ జట్టుకు రూ.20వేలతోపాటు షీల్డ్, రన్నర్ జట్టుకు రూ.15వేల నగదుతోపాటు షీల్డ్‌లను అందజేశారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా పీటర్, బెస్ట్ బౌలర్‌గా యేసయ్య, బెస్ట్ ఫీల్డర్‌గా సాయిలకు కన్సలేషన్ బహుమతులను అందించినట్లు క్రికెట్ టోర్నీ ఆర్గనైజర్ భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి కాశిరెడ్డి ఆదినారాయణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.వేణుగోపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నీ విజేత జట్టుకు నగదుతోపాటు షీల్డ్‌ను అందిస్తున్న సర్పంచ్

అల్ల నేరేడు పండ్లతో లాభాలెన్నో

పులివెందుల రూరల్ : అల్ల నేరేడు పండ్లు తినడం వల్ల లాభాలు ఎన్నో ఉన్నాయని వైద్య నిపుణులు అంటున్నారు. ప్రస్తుతం సీజన్ కావడంతో జూన్, జూలై మాసాల్లో నేరేడు పండ్లు అధికంగా మార్కెట్లో లభిస్తాయి. చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ నేరేడు పండ్లు తినడానికి ఇష్టపడతారు. అందువల్ల మార్కెట్‌లో నేరేడు పండ్లకు భలే డిమాండ్ ఉంది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో అల్ల నేరేడు పండ్లు రూ.200లకు విక్రయిస్తున్నారు. అల్ల నేరేడు పండ్లు తినడంవల్ల రోగ నిరోధకశక్తి పెరుగుతుందని వైద్య నిపుణులు అంటున్నారు. అల్ల నేరేడు పండ్లలో ఫైబర్ అధికంగా ఉండటంతో జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కొలెస్ట్రాల్‌తో బాధపడే వారికి నేరేడు పండ్లు దివ్యౌషధంగా పనిచేస్తాయన్నారు. అలాగే కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడుతున్న వారు నేరేడు పండ్ల దూరంగా ఉండాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. నేరేడు పండ్లు తినడంవల్ల సి విటమిన్ పుష్కలంగా ఉంటుందని, డయబెటిక్ రోగులు కూడా నేరేడు పండ్లు తినడంవల్ల రక్తంలో చక్కెర నియంత్రించవచ్చునని తెలిపారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న అల్ల నేరేడు పండ్లు

వైఎస్సార్‌సీపీ నాయకులను కలిసిన ఆర్సీడీఎస్ అధ్యక్షుడు



హైదరాబాద్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులను కలిసిన ఆర్సీడీఎస్ అధ్యక్షుడు, తదితరులు

పులివెందుల : హైదరాబాద్‌లో ఉన్న వైఎస్ఆర్‌సీపీ నాయకులు, వైఎస్సార్‌సీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిలను శనివారం రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వైఎస్ భాస్కర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే పులివెందులలో జరుగుతున్న ప్రస్తుత రాజకీయ అంశాలు, అక్రమ అరెస్టులు గురించి మాట్లాడారు. అనంతరం వారికి ఆయన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ప్రతిమను అందించి శాలువాలతో సత్కరించారు. ఆయన వెంట తేర్నాంపల్లి గంగాధర్‌రెడ్డి, ఆర్సీడీఎస్ సంస్థ ప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

చదువు పేరుతో వ్యాపారమా..?

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లా వ్యాప్తంగా చదువు పేరుతో వేల రూపాయలు దోచుకుంటున్న వారిపై చర్యలు తీసుకోకుండా విద్యా శాఖ అధికారులు నిద్రమత్తులో ఉన్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి అన్నారు. శనివారం నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చదువునే వ్యాపారంగా మార్చుకున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. కడప నగరం, బద్వేలు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, మైదుకూరు, పోరుమామిళ్ల ప్రాంతాలలో పుట్టగొడుగులు లాగా విద్యాసంస్థలు స్థాపించి ఈరోజు విద్యార్థులను తల్లిదండ్రులను అధిక ఫీజులతో, పుస్తకాల పేరుతో లక్షల రూపాయలు దందా చేస్తున్నారని విమర్శించారు. చదువు పేరుతో వ్యాపారం చేసే విద్యాసంస్థలపై కఠినమైన చర్యలు తీసుకొని, పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అభినయ్, కడప నగర కార్యదర్శి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలి

కడప కోటిరెడ్డి సర్కిల్ : ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలని డీపీసీ గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ సభ్యులు రామాంజనేయులు, చంద్రశేఖర్‌రెడ్డి, నాగసురేష్‌లు కోరారు. శనివారం ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డికి ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో సమస్యలను పరిష్కరించాలని వారు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి స్పందిస్తూ మంత్రి లోకేష్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

మాన్యువల్ కౌన్సెలింగ్ కావాలి

పులివెందుల : ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు వెబ్ కౌన్సిలింగ్ వద్దని.. మాన్యువల్ కౌన్సెలింగ్ కావాలని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొన్నాయి. శనివారం స్థానిక పులివెందుల ఎంఈఓ కార్యాలయంలో అధికారులు నిర్వహించే వెబ్ కౌన్సెలింగ్ హెల్ప్‌లైన్ సెంటర్ వద్ద పులివెందుల ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ వెబ్ కౌన్సెలింగ్‌లో ఉపాధ్యాయులు ఎక్కువ ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి వస్తుందని, దీనివల్ల నష్టపోయే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలకు మాట ఇచ్చిన విధంగా మాన్యువల్ కౌన్సెలింగ్ చేపట్టాలని ఎంఈఓ అధికారులకు వారు వినతిపత్రం అందించారు. దీనికి ప్రభుత్వం స్పందించకపోతే సోమవారం ఉదయం డీఈఓ కార్యాలయాల ముట్టడి కార్యక్రమం ఉంటుందన్నారు. పులివెందుల రీజియన్ నుంచి పెద్ద ఎత్తున ఉపాధ్యాయ మిత్రులు పాల్గొని ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ, వైఎస్సార్‌టీఏ, పీఆర్టీయూ, హెచ్ఎం అసోసియేషన్, పీఈటీ అసోసియేషన్, ఏపీటీఎఫ్, ఏపీయూఎస్, హిందు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎంఈఓలకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీల కొరకు తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలకు వ్యతిరేకంగా ఐక్య ఉపాధ్యాయ సంఘాల వేదిక ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించనున్నట్లు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ తమ రాష్ట్ర నాయకులు ఇచ్చిన పిలుపు మేరకు వెబ్ కౌన్సెలింగ్ బైకాట్ చేస్తూ మాన్యువల్ కౌన్సెలింగ్ కొరకు ఏదైతే మాట ఇచ్చారో అదేవిధంగా మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరుతున్నామన్నారు. లేనిపక్షంలో ఆదివారం ఉదయం 9కి జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు విజయవంతం చేయాలన్నారు.

ఆదమరిస్తే అంతే

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక లక్ష్మీ థియేటర్ సమీపంలోని నగరిగుట్టకు వెళ్లే దారిలో తాగునీటి పైపులైన్ మరమ్మతుల కోసం గొయ్యి తీశారు. తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేశారని.. కానీ గొయ్యిని మాత్రం పూడ్చడం మరిచారని వాహనదారులు, స్థానికులు వాపోతున్నారు. ఏమాత్రం ఆదమరిచి వాహనాలు నడిపితే అంతే సంగతులు అని, పాదాచారులు రాత్రి సమయాలలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మధ్యలో అడ్డంగా ఉన్న గొయ్యిని పూడ్చి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

అలరించిన నృత్య ప్రదర్శనలు



శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పులివెందుల టౌన్ : బక్రీదు పండుగను పురస్కరించుకుని స్థానిక శిల్పారామంలో శనివారం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శిల్పారామం సందర్శకులతో సందడిగా కనువిందు చేసింది. అక్కడ ఉన్న ఊయలలు, జారుడు బండలు, వివిధ రకాల ఆటవస్తువులతో, జిప్‌వే, బోటింగ్ షికార్లు కొడుతూ ఎంజాయ్ చేశారు.

సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. బక్రీదు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చెన్నూరు శ్రీలక్ష్మీనరసింహస్వామి దమ్‌బిర్యాని వారి సహకారంతో పులివెందుల యువరాజా డ్యాన్సింగ్ స్కూల్ మాస్టర్ రాజా ఆధ్వర్యంలో శిష్య బృందం శాస్త్రీయ, జానపద, వెస్ట్రన్ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శిల్పారామం బక్రీదు పండుగతో సందడి వాతావరణం నెలకొంది. సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా శిల్పారామం ఏఓ విశ్వనాథరెడ్డి పర్యవేక్షించారు.